"అవన్నీ మేం ఏర్పాటుచేసిన మండలాలు. అన్నిటికీ ప్రయోజనం ఉన్నది. చెబుతూ కూర్చుంటే చాలా వేళ అవుతుంది" అంటూ నన్ను భవనంలోపలికి తీసుకుపోయాడు. లోపల ఒక పెద్ద హాలున్నది. అది గుండ్రంగా ఉన్నది. చుట్టూ సినిమా తెరలాంటిది అమర్చి ఉన్నది. మేము దిగివచ్చిన మెట్లూ, ఏవో మీటలూ గదిమధ్య ఉన్నాయి.

అతను గదంతా చీకటిచేసి ఏదో మీటనొక్కేసరికి నా చుట్టూ అకస్మాత్తుగా ఆకాశమూ, నక్షత్రాలూ, గ్రహాలూ ప్రత్యక్షమయ్యాయి. ఒక్క క్షణంపాటు కంగారుపడ్డాను. సూర్యబింబం కేసి చూస్తే దానిచుట్టూ మంటలుకూడా కదిలిస్తున్నాయి. ఆ జ్వాల కదలికను గమనించాక నేను చూస్తున్నది బొమ్మ కాదనీ, కనీసం సినిమా అయి ఉంటుందనీ తోచింది. నా మనస్సు తెలుసుకున్నవాడల్లే అతను, "ఇది సినిమా కాదు. టెలివిజన్. నువ్వు చూస్తున్నదంతా వాస్తవంగా ఆకాశమే. మీ భూమిమీద ఉన్న గొప్ప టెలిస్కోపులకంటె సుమారు రెండువందల రెట్లు స్పష్టంగా ఆకాశాన్ని ఈ గదినుంచి పరిశీలించవచ్చు. అచ్చగా సూర్యుణ్ణిగాని, ప్రత్యేక నక్షత్రాలనుగాని, దూరపు బ్రహ్మాండాలను గాని పరిశీలించటానికి వేరే గదులున్నాయి. మీది శాస్త్రజ్ఞానంమీద నిర్మించిన జీవితం. దాదాపు ప్రతి ఒకరూ శాస్త్రజ్ఞానంకోసం కృషి చేస్తాం. దానికోసమే బతుకుతాం" అన్నాడు.

"మీ రాజకీయాలు–"

"మాకు రాజకీయాలు లేవు. సాంఘికంగా విభేదాలు లేవు."

"మీ ఆశయం ?"

"ముందుకు పోవటం. ప్రకృతిని వశపరుచుకోవటం."

"మీ వినోదం ?"

"సృష్టి, ప్రకృతి."

"శనిగాళ్ళలాగా మీ జీవితంకూడా స్తంభించిపోతే ?"

"మా జీవితం స్తంభించే అవకాశం లేదు. మా లోకం సూర్యుడికి సరిఅయిన దూరంలో ఉన్నది. మీరు మరీ దగ్గరిగా ఉండి నైసర్గికమైన మార్పులతో చాలా బాధపడుతున్నారు. శని గ్రహం మరీ దూరంగా ఉండి బొత్తిగా మార్పులు లేకుండా ఉంది. మాకు మార్పులున్నాయి గాని వాటిని ఏనాడో మా అదుపులోకి తెచ్చుకున్నాం. ఈనాడు ప్రకృతి మమ్మల్ని ఏమీ చెయ్యలేదు."

* * *

తెల్లవార్లూ మేలుకుని ఉన్న కారణం చేతనో లేక ఆ మనిషి ఏమైనా చేశాడో గాని నాకు మైకం ముంచుకు వచ్చింది. నాకు మళ్ళా స్పృహ తెలిసేసరికి మా ఊరు అంతదూరంలో ఉన్నది. తూర్పున వేగుచుక్క – అన్నట్టు శుక్రుడు – ప్రకాశిస్తున్నది........

యువ 1960 జనవరి ప్రారంభ సంచిక నుండి

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

# తిమిర సంహారం




నిటారుగా నిలబడ్డ రెండు కొబ్బరిచెట్లను విరదీస్తూ పెద్ద గర్భిణాము కాపలాగ కూర్చుంది మధ్యలో. సూటిగా దాని కెదురుగానే ధ్వజ స్తంభం ఊగిసలాడుతూ భూమిమీద తనకున్న పట్టును బిగువుగా పైకి లాగుతోంది. దానికి చిటారుగా వున్న రెండుమూడు గంటలు కీచు ధ్వనితో అల్లల్లాడుతూ వుంటాయి. ధ్వజ స్తంభం చుట్టూ కట్టిన ఎత్తైన గట్టుమీద యిటుకల్ని లెక్క పెట్టచ్చు. దానికి కొంచెం ముందుగా రెండుమూడు కొండ రాళ్లు ఏటవాలుగానూ అడ్డంగానూ పడేసి వుంచారు. అవే గడపలు. వాటిని దాటి యింకొంచెం ముందుకు వెళ్ళితే పశుపతి నాథ్ దేవాలయ ప్రాంగణం వస్తుంది. లోపలికి అడుగుపెట్టంగానే ఎడంవైపు పసుపుపచ్చ గన్నేరుచెట్టు విరగబూసి పూలతోనూ, మొగ్గలతోనూ బరువు మోయలేక వంగి భూమిమీద పడి వుంది, సాష్టాంగ ప్రమాణం చేసినట్టుగా. ఎడంవైపు ఎండిపోయిన పగడపూలచెట్టు, దానికి చిటారున రెండు మూడు కొమ్మలున్నాయి. అప్పుడప్పుడు ఒకటి రెండు పూలు భూమిమీద రాలుస్తూ వుంటుంది. ఇంకొంచెం ముందు కడపరాయి పరిచి వుంది. ఆ కడపరాతిమీద కుదురుగా నంది కూర్చుని వుంది. దానికి ముందే గర్భగుడి. ఆ గుళ్ళో నిరామయంగా నిశ్చలంగా నిర్వికారంగా పశుపతినాథ్ నిలబడి వున్నాడు. ప్రక్కనే వున్న ప్రమిదలో అంటుకుపోయిన నూనెను కరుచుకుని వత్తులు రెండు పోటీపడుతున్నాయి ముందు నువ్వా నేనా అన్నట్టు. పెద్ద విభూతిపండు ఓ దిమ్మమీద పెట్టి వుంది. అరచేతుల తాకిడికి అది బాగా లోతుగా పోయివుంది. ఇప్పుడు భక్తులు దాని అంచులమీద రెండువేళ్ళు గట్టిగా అదిమి నుదిటికి తాకించుకుంటూ వుంటారు. కోరుకున్నవి నెరవేరుస్తాడు.

ఆ దేవుడి మహిమ అలాంటిది.

ఆ గుళ్ళో పూజారి సదాశివంగారు యాంత్రికంగా వచ్చేసి రెండు వత్తులు వెలిగించి పూజచేసి నైవేద్యం పెట్టి చప్పున రెండు తలుపుల్ని దగ్గరగా లాగి తాళంవేసి వెళ్ళిపోతూవుంటాడు. తండ్రీ తాతలు చేసిన పనే యీయన చేస్తున్నాదే గాని, యీయన కొడుకు గంగాధరానికి మాత్రం యీ పద్ధతేమి నచ్చలేదు. తల్లి తండ్రులు ఎంతవద్దన్నా వినకుండా కాలేజీలో చేరాలని పట్టుబట్టాడు. బి. ఏ ఫస్టున పాసయ్యాడు. తండ్రికి లోపల లోపల సంతోషంగావున్నా, పైకి మాత్రం బింకంగా యీ చదువులేమిటి అంటాడు. గంగాధరం మాత్రం ఆత్మవిశ్వాసం యెంతో పెంచుకున్నాడు, ఎం.ఏ కూడా చదవాలని పట్టుపట్టాడు. తల్లి పార్వతమ్మ తటపటాయించింది. ఇట్టే రెండు శివరాత్రిళ్లు వెళ్ళిపోయినాయి. గంగాధరం ఎం. ఏ కూడా ఫస్టుక్లాసులో పాసయ్యాడు. పార్వతమ్మకూడా సంతోషం పట్టలేక








పోయింది. ఇద్దరూకూడా కొడుకును చూసి గర్వపడుతున్నారు.

'....ఏం సదాశివంగారు! మీ వాడు ఉద్యోగం చేస్తాట్టగా.'

'ఏమో నాకేం తెలుస్తుంది-అదంతా వాడిష్టం. అయినా మన చేతుల్లో యేముంది ఆ పరమేశ్వరుని దయ....' సదాశివం పూర్తి విశ్వాసంతో అన్నాడు.

• • •

'ఏం నాయినా యింత అలసటగా వున్నావేంటి యివ్వాళ....మాట్లాడవేంరా....'

'నన్ను పలకరించకండి నాన్నా. యీ ఉద్యోగంకూడా రాలేదు'....గంగాధరం చాలా నిరుత్సాహంగా అన్నాడు.

'నువ్వు బాధపడక. ఇవ్వాళ సోంవారం. నాతో గుళ్ళోకి రా. రుద్రాభిషేకం చేయిస్తా....'

గంగాధరం కస్సుమని చూశాడు తండ్రి వంక. సదాశివం ఉలిక్కిపడ్డాడు. ఏమిటివ్వాళ నాగుబాము కస్సుమంటోంది దేవరవారికి అపచారమేమన్నా జరిగిందా అనుకున్నాడు. నాలుగో సోమవారంకూడా రుద్రాభిషేకంచేసి చాలా సంతృప్తిగా కొడుకు మొహంలోకి చూశాడు. పార్వతమ్మకు కొంచెం మనస్సు విలకడయింది. మంగళవారంనాడు మహా రౌద్రంగా లోపలికివచ్చి చేతిలోవున్న కాగితాల కట్ట నేలకేసికొట్టి, యిహ మనకు ఉద్యోగం రాదు అన్నాడు విసురుగా గంగాధరం.

'ఇంకా పరమేశ్వరునిదయ రాలేదన్న మాట. నాలో ఏదోలోపం జరిగివుంటుంది, స్వామీ నన్నేం చెయ్యమంటావు,

ఇన్నేళ్ళనుంచి నిన్ను సేవిస్తున్నా నేను ఒక్క వరమూ అడగలేదు. నీ సేవే నాకు వరం అనుకున్నాను. అంతకంటే నాకు కావల్సిందేముంది. కాని నేను యీనాడు మాత్రం నిన్ను అడక్క తప్పదు. నువ్వు కరుణించి తీరాల్సిందే. .' భక్తుడు భగవంతుణ్ణి అజ్ఞాపించాడు.

ఏమిటి అని ఆ పశుపతినాధుడు తనను అడుగుతున్నట్టు ఊహించుకుని 'గంగాధరానికి ఉద్యోగం యిప్పించు స్వామీ' అంటూ ప్రాధేయపడ్డాడు సదాశివం. ఆయనకు క్షణంలో శరీరంలో విద్యుత్తు ప్రవహించినట్లనిపించింది. వళ్ళు ఝల్లుమంది. ఆయనకు అపూర్వమైన అనుభూతేమిటో కల్గింది ఈనాటికి ఆ దయామయుడికి కరుణ కలిగిందనుకున్నాడు. భార్యను పిలిచి ఎంతో సంతృప్తిగానూ, ఎంతో సంతోషంగానూ చెప్పాడు. కాని పార్వతమ్మ స్తబ్ధతగా వుండిపోయింది.

'మన పూజలు ఫలించే రోజులు వస్తున్నాయి....' ఎంతో ఆశగా అన్నాడు సదాశివం.

పార్వతమ్మ కళ్ళు తుడుచుకుంటూ 'అబ్బాయి యీ మధ్య సరిగ్గా వుండటం లేదు. ఏమిటో తమాషాగా మాట్లాడుతున్నాడు నా కెందుకో భయమేస్తోందండి....' వణుకుతూ అన్నది పొర్లుకుంటూ వచ్చిన దుఃఖాన్ని ఆపలేకపోయింది.

ఆయన విస్తుపోయాడు. ఒక్క క్షణం భార్యకళ్ళలోకి చూసి, 'ఏమయింది? ఏమంటున్నాడు? ఎట్లా వున్నాడు' ఆదుర్దాగా అడిగాడు.

పార్వతమ్మ యేమీ సమాధానం చెప్పలేదు.

'అబ్బాయేడీ?....'

'గదిలో పడుకున్నాడు.'

గది ముందర నిలబడి 'మంచం మీద బోర్లపడుకునివున్న గంగాధరాన్ని చూసి త్రుళ్ళిపడ్డాడు సదాశివం.

'ఆ పడకేమిటి? ఆ వాలకం యేమిటి....భోంచేశాడా?'

'భోజనానికి రమ్మంటుంటే ఆకలి లేదంటున్నాడు....' సన్నగా అన్నది పార్వతమ్మ.

సదాశివం గబగబ గుళ్ళోకి వెళ్ళి దీపారాధనచేసి చేతులు రెండూ జోడించి 'తండ్రీ నాకు నువ్విచ్చే ప్రతిఫలం యిదేనా. నాకు నువ్వు ప్రసాదించిన యీ వరాన్ని తీర్చిదిద్దే బాధ్యత నీదిగాదా? నేను చేసిన తప్పేమిటి? నన్నింకా యేం చెయ్యమంటావు....' తనలో తాను ప్రశ్నలవర్షం కురిపిస్తున్నాడు. రెండు కళ్ళు పెద్దవిచేసి తీక్షణంగా చూస్తున్నాడు. తనకేమీ సమాధానం దొరకటంలేదు, చాలా సేపటిదాకా ధ్యానంలో వుండిపోయి తిరిగి యింటికి వచ్చేశాడు.

పార్వతమ్మ రోజు రోజు క్రుంగి కృశించిపోతోంది. 'అబ్బాయి బాగా నిరుత్సాహపడిపోతున్నాడు. తనకు ఉద్యోగం రావటంలేదు. తనకంచె





తక్కువ మార్కులు వచ్చినవాళ్ళకు ఉద్యోగాలు యిస్తున్నార్ట. దిగులుపడిపోతున్నాడు. వాడి ప్రవర్తన, వాడి మాటలు చాలా విడ్డూరంగా వున్నాయి. పిచ్చియెత్తుతుందో యేమో అని భయంగా వుంది....' పార్వతమ్మ ఆయాసపడిపోయింది.

'మనం మానవమాత్రులం. ఏం చెయ్యకలుగుతాం. ఆ దయాసముద్రుడికి కరుణ కలగాలి. అంతవరకు మనం ఓపికగా వేచి ఉండాల్సిందే. మన లోపం యేమిటో మనకు తెలీటంలేదు ఎల్లుండి ఏకాదశినాడు ఉపవాసం వుండి ఏకాదశీ రుద్రాభిషేకం చేస్తాను. తప్పక స్వామి వారికి దయకలుగుతుంది....' భార్యకు ధైర్యం చెప్పానని సంతృప్తిపడ్డాడు, సదాశివం.

పారతమ్మ యేమీ మాట్లాడలేదు.

పౌర్ణమికూడా వెళ్ళిపోయింది.

ఆదుర్దాగా భయంతో వణుకుతూ పార్వతమ్మ భర్తముందర నిలబడింది.

తల పైకెత్తి చూచాడు.

'నాకు తెలుసు నీ ఆవేదనేమిటో. నువ్వేమీ భయపడక్కర్లేదు. వెళ్ళనీ ఇంటర్వ్యూకి వెళ్ళనీ. ఈసారి వాడికి ఉద్యోగం వచ్చి తీరుతుంది....' ఎంతో ఆత్మవిశ్వాసంతోనూ ధైర్యంగానూ అన్నాడు సదాశివం.

'నా కెందుకనో భయమేస్తోంది. ఈ సారి కనుక వాడికి ఉద్యోగం రాకపోతే యేమఘాత్యం చేస్తాడో యేమో....' పార్వతమ్మ ఉక్కిరిబిక్కిరయిపోయింది.

'నీ కింకా భగవంతుని లీలలు అర్థం కాలేదు....' ఎంతో తాపీగా అన్నాడు.

పార్వతమ్మ రెండు చేతులు పైకి యెత్తి మెల్లగా ఏదో శ్లోకం చదువుతూ ప్రార్థిస్తోంది.

సదాశివం స్తబ్ధుడయిపోయాడు.

పొద్దూకింది. గంగాధరం రైలు స్టేషన్‌కు బయలుదేరాడు. ఈ సారి ఎన్నడూలేని కొత్త రకంగా దీవనలు అడిగాడు. తల్లితండ్రుల పాదాలకు నమస్కారం చేశాడు. లోలోపల తండ్రి దీవించాడు. తల్లి కొడుకును చుట్టేసుకుని బావురుమంది.

'నాయనా నువ్వు ప్రయత్నం చేస్తున్నావు. కష్టపడ్డావు. నీ చేతిలో వున్నది నువ్వు సాధించావు. అందరినోటా శభాష్ అనిపించుకున్నావు. ఉద్యోగం రావటం మనచేతిలో వుందా నాయనా? ఇంకోళ్ళు యిస్తే మనం తీసుకోవాలి. అధైర్యపడద్దు. పని అవంగానే వెంటనే తిరిగి రావాలి. నీకోసం వెయ్యికళ్ళతో యెదురుచూస్తూ వుంటా....' కంట తడి తుడుచుకుంటూ, గంగాధరం కనుమరుగు అయ్యేటంత వరకూ వీధిగుమ్మంలోనే నిలబడి చూసింది పార్వతమ్మ.

సదాశివం మామూలుగానే గుళ్ళోకి వెళ్ళి తలుపులు తెరిచాడు. ఈ సారి రెండు వత్తులు తేజోవంతంగా వెలుగు

తున్నట్లు తన కంటికి కనబడ్డాయి. ప్రమిదలో నూనె నిండా వుందేమిటి అని కళ్ళు ముడుచుకుని చూస్తున్నాడు. అటూ యిటూ చూశాడు.

'తండ్రీ జ్యోతిని నువ్వే వెలిగించుకున్నావా....' తలవంచి రెండు చేతులు జోడించి వినమ్రుడయి నమస్కారం చేసి అక్కడే చతికిలబడిపోయాడు. భార్యతో చెప్పాలనే తహతహ బయలుదేరింది.

'విన్నావా!....ఇవ్వాళ స్వామి వారి సన్నిధిలో రెండు వత్తులు జ్యోతుల్లాగ వెలుగుతున్నాయి. ప్రమిదలో నిండా నూనెకూడా వుంది. ఇది ఆయన మహిమ కాకపోతే యింకేమిటి? ఇదొక శుభ సూచకం. అబ్బాయికి ఉద్యోగం దొరుకుతుంది. క్షేమంగా తిరిగి వస్తాడు. ఇది ముమ్మాటికి నిశ్చయం....'

పార్వతమ్మ యీ మాటలు వినిపించుకున్నట్లు ప్రవర్తించలేదు.

వస్తానన్న గడువు దాటి రెండు రోజులయింది. పార్వతమ్మ తబ్బిబ్బులాడిపోతోంది. వచ్చేపోయేవాళ్ళను తన కొడుకు సంగతి అడగటం మొదలు పెట్టింది. భర్తను వేధిస్తోంది పట్నం వెళ్ళి కనుక్కుని రమ్మనమని. ఆయనకు యెటూ తోచటంలేదు. రోజులు గడుస్తున్నకొద్దీ ఆవేదన యెక్కువయిపోతోంది. సదాశివంకూడా కొయ్యబారిపోయాడు.

'సదాశివంగారూ...' అంటూ నలుగురు సాయం సంధ్యవేళ యింటికొచ్చారు.

'మా అబ్బాయి యేమన్నా కనిపించాడా....' పార్వతమ్మ అమాంతం లోపల్నుంచి వచ్చింది.

'లే....లేదమ్మా....' తడబడపడుతూ అన్నారు.

'కోటయ్యా, తంగనాధంగారు....పరిభూషణావారిగారా....' సదాశివం ఆశ్చర్యంగానూ అదుర్దాగాను ఏదో అడగబోతున్నాడు.

'....ఏమండీ....మనవూరబ్బాయే....ఆత్మ....హత్య....చేసుకున్నాట్ట.'

'ఆ!....'

'ఉద్యోగం రావటంలేదని విసిగి చివరకు యీ పని చేశాట్ట....పేపర్లో వేశారు....'

సదాశివం నోట మాటలేదు.

'ఎంతో కష్టపడి చదివి ఫస్టున ప్యాసయ్యాను. మాస్టర్ డిగ్రీలో కూడా ఫస్టునే వచ్చాను. కాని ఉద్యోగంలో మాత్రం చివరివాణ్ణి....కొన్ని ఉద్యోగాలకు నే నసలే అర్హుణ్ని కాదన్నారు. కొన్నింటిలో నాకు అవకాశాలు లేవన్నారు. ఈ దారుణమైన విధానానికి నాలాంటివారు యెంతోమంది బలయిపోతున్నారు. దానికి మోక్షంలేదు. ఎవరికి చెప్పినా వినిపించుకోవటంలేదు. వినిపించుకోరు కూడా. మన వ్యవస్థ అలాంటిదయిపోయింది. మెరిట్‌కు తెలివితేటలకు తగిన స్థానం లేకపోవటం చాలా శోచనీయం. ఇలాంటి దయనీయ పరిస్థితి యింకా యిట్లాగే కొనసాగితే మనదేశం నిర్వీర్యమైపోతుంది. మెరిట్‌ను తగినట్లుగా గౌరవిస్తేనే మన ప్రగతికి అర్థము. మిగతా వాదనంతా వ్యర్థం.

ఇట్లు

**ఒక అభాగ్యుడయిన నిరుద్యోగి.**

పార్వతమ్మకు ఏమీ అర్థం కావటం లేదు. సదాశివం కొయ్యబారిపోయాడు.

'మనిషిని గుర్తుపట్టేటట్లు లేదట....ఫలానా అని యెవ్వరో తెలియటంలేదు....ఓసారి యిటురండి.... ఆ అబ్బాయి చొక్కా జేబులో 'గంగాధరం' అని చీటి ముక్క కనిపించిందిట....'

సదాశివం తూలి క్రిందపడబోతుంటే ఆ యిద్దరూ పట్టుకుని అరుగుమీద కూర్చోపెట్టారు. పార్వతమ్మ సావిట్లో నేలమీద పడుకునివుంది. నిమిషంలోకి నలుగురూ పోగయ్యారు. తలొకమాట అంటున్నారు. వాళ్ళిద్దరికీ అవుతే యే మాటలు వినిపించటంలేదు.

పార్వతమ్మకు రానురాను భగవంతుని మీద భక్తివిశ్వాసాలు సడలిపోయినాయి. చెట్టంత కొడుకు పోయింతర్వాత యింకా దేవుడేమిటి దయ్యమేమిటి. నమ్ముకున్న వాళ్ళను నట్టేట్లో ముంచేశాడు. ఇంకా ఆయనమీద భక్తేమిటి....! ఆయనకు పూజ లేమిటి! మన పిచ్చిగాని అని బాహటంగా అంటోంది. ఆమెలో కలిగిన యీ తీవ్ర పరిణామం సదాశివాన్ని పూర్తిగా కలవర పెట్టేసింది దీనికి విరుద్ధంగా సదాశివం ప్రవర్తిస్తున్నారు.

'పరమేశ్వరయ్యా! నువ్వు నన్ను మోసం చెయ్యలేవు. నన్ను యిట్లా పరీక్ష చేస్తే నేను భయపడిపోయి నీ దగ్గర్నుంచి దూరంగా పారిపోతానని అనుకుంటున్నావు కాదు. అట్లా యెప్పటికీ జరగదు. నా బొందిలో ప్రాణం వున్నంతవరకు నిన్ను నమ్ముకుంటాను. నువ్వేం చేసినా సరే బాధ్యతంతా నీదే.' రెండు చేతులూ కట్టుకుని సదాశివం తనలో తాను సణుక్కోవటం ఎక్కువయిపోయింది.

ఇది చూసిన వాళ్ళందరూ, పాపం ఆ పూజారికి పిచ్చియెక్కిపోయింది అనుకుంటున్నారు.

ఎప్పుడూ ఆ గుళ్ళోనే పడివుంటాడు. మనసకచీకటి తొలగిపోతోంది. ఉదయ భానుడి లేతకిరణాలు మెల్లి మెల్లిగా పాక్కుంటూ గుడి శిఖరంమీదికి ఎక్కి గోపురాన్ని తళతళ మనిపించినాయి. పచ్చపచ్చగా గుడి చుట్టు ప్రక్కల వెలుతురు కాంతులు విరజిమ్ముతున్నాయి. పసుపుపచ్చ గన్నేరు పూలు విచ్చుకున్నాయి. విచ్చిన పువ్వుల్లో నిలబడ్డ ఒకటి రెండు నీటిబిందువులు సూర్య కిరణాల రశ్మికి ముత్యాల్లాగ మెరుస్తున్నాయి.

ఆ అమ్మాయి ఎవరోగాని భక్తిశ్రద్ధలతో గుళ్ళోకి ప్రతి సోమవారం తప్పక

వస్తోంది. సదాశివం ఆ అమ్మాయి వంక చూశాడేగాని యెవరో తెలుసుకోలేక పోతున్నాడు. తెలుసుకోవాలనే ఉద్దేశం కలిగింది. దగ్గరకు వెళ్ళంగానే 'నమస్కారం' అన్నది ఆ అమ్మాయి అతి వినయంగా.

కుడిచెయ్యి ఆమెవైపు చూపిస్తూ చిరునవ్వు నవ్వాడు. ఆమె మొహంలోకి చూడంగానే, నేను ఫలానావారి అమ్మాయిని. ఈ వూరికి రావటం కొత్తే. ఈ పశుపతినాథుని మహిమ ఆ నోటా ఆ నోటా విన్నాను. గొప్ప మహిమగల దేవుడని, అనుకున్న సంకల్పాన్ని నెరవేరుస్తాడని తెలిసింది. అందుకనే నే వస్తున్నాను అని టూకీగా చెప్పేసింది.

ఆమె విశ్వాసానికి ముగ్ధుడయి పోయాడు.

'నీ కోరికేమిటో నేను తెలుసుకోవచ్చా....' చాలా అమాయకంగా అడిగాడు, సదాశివం.

మొదట్లో తటపటాయించింది. సిగ్గును అభినయిస్తూ చెప్పింది.

'నేను కోరుకున్నవాడు, ఉద్యోగం కోసం నానా అవస్థలు పడుతున్నాడు. ఉద్యోగం వస్తేకాని పెళ్ళిచేసుకోనని పట్టుదల. ఉద్యోగం రావాలని నేను ప్రార్థించటానికి వచ్చాను. నా కోరిక నెరవేరుతుందా; మా పెళ్ళి త్వరలో అవుతుందా....' చాలా దీనంగా ప్రాధేయపడుతూ అడిగింది, ఆ అమ్మాయి.


ఒక్కక్షణం అయన గొంతు మూగబోయింది. మళ్ళీ మరుక్షణంలోనే తెప్పరిల్లి, 'కరుణాసముద్రుడు నమ్ముకున్న వాళ్ళను ఆదరిస్తాడు. నీ కోరిక సఫలం కావాలని నేను కూడా మనస్ఫూర్తిగా ఆ దేవదేవున్ని ప్రార్థిస్తున్నానమ్మా....' అన్నాడు బరువైన హృదయంతో, సదాశివం.

ఆ అమ్మాయి చప్పున సదాశివం కాళ్ళకు నమస్కారంచేసి గ్రిరున తిరిగి వెళ్ళిపోయింది.

రోజులు దొర్లినా అనుకున్న మార్పు ఎక్కడా కనిపించటంలేదు. ఎవరిలోనూ సంతృప్తి తొణికిసలాడటంలేదు. అయితే విశ్వాసం, పట్టుదల కొనవూపిరితో వూగిసలాడుతున్నాయి. సదాశివంలో క్రమ క్రమంగా మార్పు కనిపిస్తోంది. ఆరోగ్యం చెడిపోవటంతోపాటు కొడుకు పోయాడనే దుఃఖము తెలీకండా నే ఆయన్ను క్రుంగదీసేస్తోంది. ఈ మధ్య కాలంలో అయితే చాలా సేపు గుడిని అంటిపెట్టుకుని వుంటున్నాడు. దోపిడీలు ఎక్కువవుతున్నాయని తెలిసినప్పటి నుంచీ మరీ యెంతో జాగ్రత్తగా వుంటున్నాడు. 'రానురాను నాస్తికత్వం ప్రబలిపోతోంది' అనుకున్నాడు మనస్సులో.

అప్పటినుంచి సదాశివం దిన గుళ్ళోనే అయిపోయింది. కొంతమందికి అనుమానాలు బయలుదేరినాయి. విషయం యేమిటో తెలుసుకుందామని ఆయన లేని






సమయంలో ఒకళ్ళిద్దరు గుళ్ళో ప్రవేశించారు. అంతా చూస్తున్నారు. గూట్లో ప్రతిమలున్నాయి. సగం వెలిగిన వత్తులు రెండుమూడున్నాయి. ఒక ప్రతిమ క్రింద పదిపైసల బిళ్ళలు రెండున్నాయి. ఎడంవైపు గూట్లో రాగిచెంబు బోర్లించి వుంది. తిరిగితీస్తే దాంట్లో ఒకరూపాయి బిళ్ళ కనిపించింది. పశుపతినాధ్ విగ్రహం వెనకాల రాయి, ఆ రాయిమీద బిళ్వపత్రాలు ఎండినపూలు కొబ్బరి కాయల కొట్టిన ముక్కలు, ఆ ప్రక్కన నాపరాయి మీద ఒక చెక్కపీట అంతకు మించిన ఆస్తిపాస్తులేమీ కనిపించటంలేదు.

ఆనాడు అమావాస్య. సదాశివం దూరపు బంధువుకు అకస్మాత్తుగా జబ్బుచేసిందని ప్రమాదస్థితిలో వున్నాడని, చివరి క్షణాల్లో ఆయన్ను చూడాలని ఆయనచేత తులసీదళం మింగాలనుకుంటే పునర్జన్మ వుండదనే కోరికతో, ఆయన్ను వెంటపెట్టుకు రమ్మని మనిషిని పంపించాడు.

'అయ్యగారు ఆలస్యంచేస్తే మనం అక్కడకు వెళ్ళినా ఉపయోగం వుండదండీ. త్వరగా రావాలి' అంటూ ఒకటే ఊదరపెట్టటంవలన యీయనకేమీ తోచటంలేదు. ఉన్నవాడు వున్నట్టుగా బయలుదేరాలంటే సదాశివానికి మనస్సు వప్పటంలేదు. పెద్ద ప్రాణసంకటం తెచ్చిపెట్టాడే అని మధనపడిపోతున్నాడు సదాశివం.

'ఓసారి యిలా....వింటున్నావుగా. పరమేశ్వరంగారికి ప్రాణాపాయంగా వుందిట. నన్ను రమ్మని కబురుచేశాడు.

నాచేత తులసీదళంతో నీళ్లు పోయించు కోవాలని ఆయన చివరి కోరికట. చివరి క్షణాల్లో కోరిక తీర్చకపోతే పాపం....'

'ఇంత రాద్ధాంతం యెందుకు దానికి వెళ్ళరండి....' మామూలుగానే అన్నది పార్వతమ్మ.

సదాశివానికి ఏమి చెప్పాలో ఎట్లా చెప్పాలో అర్థంకాకుండా వుంది. తట పటాయిస్తున్నాడు.

'మళ్ళీ రేపు తిరిగివస్తాను....'

'రేపులేకపోతే యెల్లుండి రండి. ఇక్కడ మించిపోయేదేముంది. నేను రెండు పూట్ల వెళ్ళి మీ దేవుడికి పూజచేసి యింత నైవేద్యం పెట్టి వస్తాలెండి.... అదేగా మీ దిగులు....'విసురుగా అన్నది.

'అదే....అదే....నే చెప్పబోయేది అదే....అయితే రాత్రిపూట....' ఆమె మొహంలోకి చూస్తూ ఆగిపోయాడు.

'రాత్రిపూట....' విరుచుకుపడ్డట్టు అన్నది పార్వతమ్మ.

'ఏంలేదు....రాత్రిళ్ళు గుళ్ళో పడు కుంటే....'

'నేను రాత్రిళ్ళు గుళ్ళో పడుకోవాలా ....మీకేమన్నా మతిపోయిందా....'

సదాశివం నోట మాటలేదు.

'ఎవరా అమ్మాయి మనింటికే వస్తు న్నట్టుంది....' పార్వతమ్మ మనస్సు యిట్టే ఆ వస్తున్న అమ్మాయివైపు మళ్ళింది.

'ఆ....అమ్మాయే....ఆ అమ్మాయే పూజకు వస్తూ వుంటుంది....' అను కున్నాడు తనలో తాను.

'నమస్కారమండి....'

క్షణం ఆగిపోయాడు సదాశివం.

'నేనండి....నేను....'

'ఓహో....'

పార్వతమ్మ అటూ ఇటూ మొహం చిట్లించి చూస్తోంది.

'నేను....నే....ను....మూడురాత్రిళ్ల జాగరణ చెయ్యాలని అనుకుంటున్నాను. అప్పటికైనా ఆ కైలాసనాధునికి దయ కలుగుతుందేమో. నేను గుళ్ళో....' వీళ్ళు నములుతున్నట్లు మాట్లాడింది.

సదాశివం మొహం విప్పారింది.

ఆ శంకరుడే నన్ను పంపించి వుంటాడు అనుకున్నాడు మనస్సులో.

'తప్పక అట్లాగే చెయ్యమ్మా. నేను కూడా యిప్పుడే వూరు వెళుతున్నాను' అన్నాడు సంతృప్తిగా.

అమయ్య! యీ సమస్య తీరిపోయింది అంటూ నిట్టూర్చింది పార్వతమ్మ.

అదరాబాదరాగా ఓ సంచీలో ధావళి రాగిపంచపాత్ర, ఉద్ధరిణి, ఉత్తరీయం దోవతి పెట్టుకున్నాడు. రుద్రాక్షమాల మాత్రం మరొక చిన్న సంచీలో పెట్టు కున్నాడు. రెండు పుస్తకాలు చేత్తో పట్టు కున్నాడు. కళ్ళజోడు సరిచేసుకుంటూ ప్రయాణమయ్యాడు. ఒక్క అంగలో గుడివైపు వెళ్ళి మనసారా ప్రార్థించి 'అమ్మాయి జాగ్రత్త' అని హెచ్చరిక చేసి మరీ బయలుదేరి వెళ్లాడు.



పార్వతమ్మ నిశ్చితంగా గుర్రుపెట్టి గాఢంగా నిద్రపోయింది.

'నిన్ను చూస్తాననుకోలేదు....' అంటూ ఆపురుమన్నాడు, పరమేశ్వరం గారు.

కుశలప్రశ్నలు వేస్తున్నాడు సదా శివం.

'నీతో మాట్లాడుతుంటేనే నాకు రోగం తగ్గిపోతోంది. ఆశ్చర్యంగావుందే. నువ్వు సామాన్యుడవుకాదు సాక్షాత్తు శంకరుడివే ....' చేతులెత్తి నమస్కారం చేశాడు, పరమేశ్వరం.

సదాశివానికి యేమీ అర్థం కావటం లేదు. అంతా అయోమయంగా వుంది.

'ప్రమాదమని చెప్పాడు. తీరా యీయన్ను చూడపోతే జబ్బు మనిషిగా కనిపించటంలేదు' అనుకున్నాడు. తన మనస్సంతా ఆ గుడివైపే వుంది. ఎప్పుడు తను వూరొచ్చి పడదామా అని తహ తహ లాడుతున్నాడు.

సదాశివం వసారాలో నులకమంచం మీద నల్లులతో పోట్లాడుతున్న సమయంలో, పార్వతమ్మ పడకగదిలో పరుపుమీద గుర్రుపెట్టి గాఢంగా నిద్ర పోతోంది.

ఆ గుడి ప్రాంగణంలో భక్తురాలితో పాటు యింకా పలుగులు పారలు పట్టు కుని తవ్వుతుంటే, పశుపతినాధ్ ఉలిక్కి పడిపోతున్నాడు. భక్తురాలు తన్మయ త్వంతో భక్తిగీతాలు పాడుతూ వుంటే, సదాశివం నులకమంచంమీద కూర్చుని శంకరున్ని తలుచుకుంటున్నాడు.

'తండ్రీ! సొమ్మును కాపాడటానికి నేను యివ్వాళ అక్కడలేను. ఈ రాత్రికి నువ్వే కాపలా వుండాలి. ఆ బాధ్యతంతా నీదే. దాన్ని రక్షించి, నాకు అప్ప గించాలి. ఏం చేస్తావో, ఎట్లా చేస్తావో' లోపల లోపల గొణుక్కుంటున్నాడు సదాశివం. వసారాలో వసికర్ర ఆధా రంగా నిలబెట్టిన వత్తిదీపం చప్పున కొడిగట్టింది. సదాశివం ఉలిక్కిపడ్డాడు. గుండె ఆగినంత పనయింది. గభాలున మంచంమీద నుంచి లేచాడు.

ఇట్టే భళ్ళున తెల్లారింది. ఆ గుళ్ళోకి వెలుతురు వచ్చింది. పార్వతమ్మ పడు కున్న గదిలో సూర్యకిరణాలు సోకినాయి.

సదాశివం ప్రాతఃసంధ్య సూర్యుని ఎదుట నిలబడి చేశాడు. ఒక్క క్షణం అక్కడ యింకా ఆగబుద్ధి పుట్టలేదు.

వెళ్ళొస్తానంటూ బయలుదేరేటప్పటికి పరమేశ్వరం పక్కన నవ్వాడు.

సదాశివం బిత్తరపోతూ చూస్తూ ఆగిపోయాడు, ఆ నవ్వుకు కారణం యేమిటా అని.

ఇంట్లో అడుగు పెడుతూ పెడుతూనే .... 'ఆ అమ్మాయి రాత్రంతా జాగరణ చేసిందా' అన్నాడు సదాశివం బెంగ్గా.

'నాకేం తెలుస్తుంది, నేను అటువైపు వెళ్ళానా పెట్టానా' అన్నది విసుగ్గా పార్వతమ్మ.

నాచేత తులసీదళంతో నీళ్లు పోయించు కోవాలని ఆయన చివరి కోరికట. చివరి క్షణాల్లో కోరిక తీర్చకపోతే పాపం....'

'ఇంత రాద్ధాంతం యెందుకు దానికి వెళ్లరండి....' మామూలుగానే అన్నది పార్వతమ్మ.

సదాశివానికి ఏమి చెప్పాలో ఎట్లా చెప్పాలో అర్థంకాకుండా వుంది. తట పటాయిస్తున్నాడు.

'మళ్ళీ రేపు తిరిగివస్తాను....'

'రేపులేకపోతే యెల్లుండి రండి. ఇక్కడ మించిపోయేదేముంది. నేను రెండు పూట్ల వెళ్ళి మీ దేవుడికి పూజచేసి యింత నైవేద్యం పెట్టి వస్తాన్లెండి.... అదేగా మీ దిగులు....'విసురుగా అన్నది.

'అదే....అదే....నే చెప్పబోయేది అదే....అయితే రాత్రిపూట....' ఆమె మొహంలోకి చూస్తూ ఆగిపోయాడు.

'రాత్రిపూట....' విరుచుకుపడ్డట్టు అన్నది పార్వతమ్మ.

'ఏంలేదు....రాత్రిళ్ళు గుళ్ళో పడు కుంటే....'

'నేను రాత్రిళ్ళు గుళ్ళో పడుకోవాలా ....మీకేమన్నా మతిపోయిందా....'

సదాశివం నోట మాటలేదు.

'ఎవరా అమ్మాయి మనింటికే వస్తు న్నట్టుంది....' పార్వతమ్మ మనస్సు యిట్టే ఆ వస్తున్న అమ్మాయివైపు మళ్ళింది.

'ఆ....అమ్మాయే....ఆ అమ్మాయే పూజకు వస్తూ వుంటుంది....' అను కున్నాడు తనలో తాను.

'నమస్కారమండి....'

క్షణం ఆగిపోయాడు సదాశివం.

'నేనండి.... నేను....'

'ఓహో....'

పార్వతమ్మ అటూ ఇటూ మొహం చిట్లించి చూస్తోంది.

'నేను.... నే....ను....మూడురాత్రిళ్ల జాగరణ చెయ్యాలని అనుకుంటున్నాను. అప్పటికైనా ఆ కైలాసనాథునికి దయ కలుగుతుందేమో. నేను గుళ్ళో....' పళ్ళు నములుతున్నట్లు మాట్లాడింది.

సదాశివం మొహం విప్పారింది.

ఆ శంకరుడే నన్ను పంపించి వుంటాడు అనుకున్నాడు మనస్సులో.

'తప్పక అట్లాగే చెయ్యమ్మా. నేను కూడా యిప్పుడే వూరు వెళుతున్నాను' అన్నాడు సంతృప్తిగా.

అమయ్య! యీ సమస్య తీరిపోయింది అంటూ నిట్టూర్చింది పార్వతమ్మ.

అదరాబాదరాగా ఓ సంచీలో ధావళి రాగిపంచపాత్ర, ఉద్ధరిణి, ఉత్తరీయం దోవతి పెట్టుకున్నాడు. రుద్రాక్షమాల మాత్రం మరొక చిన్న సంచీలో పెట్టు కున్నాడు. రెండు పుస్తకాలు చేత్తో పట్టు కున్నాడు. కళ్ళజోడు సరిచేసుకుంటూ ప్రయాణమయ్యాడు. ఒక్క అంగలో గుడివైపు వెళ్ళి మనసారా ప్రార్థించి 'అమ్మాయి జాగ్రత్త' అని హెచ్చరిక చేసి మరీ బయలుదేరి వెళ్లాడు.



పార్వతమ్మ నిశ్చింతంగా గుర్రుపెట్టి గాఢంగా నిద్రపోయింది.

'నిన్ను చూస్తాననుకోలేదు....' అంటూ ఆపురుమన్నాడు, పరమేశ్వరం గారు.

కుశలప్రశ్నలు వేస్తున్నాడు సదా శివం.

'నీతో మాట్లాడుతుంటేనే నాకు రోగం తగ్గిపోతోంది. ఆశ్చర్యంగావుందే. నువ్వు సామాన్యుడవుకాదు సాక్షాత్తు శంకరుడివే ....' చేతులెత్తి నమస్కారం చేశాడు, పరమేశ్వరం.

సదాశివానికి యేమీ అర్థం కావటం లేదు. అంతా అయోమయంగా వుంది.

'ప్రమాదమని చెప్పాడు. తీరా యీయన్ను చూడబోతే జబ్బు మనిషిగా కనిపించటంలేదు' అనుకున్నాడు. తన మనస్సంతా ఆ గుడిపైపే వుంది. ఎప్పుడు తను వూరొచ్చి పడదామా అని తహ తహ లాడుతున్నాడు.

సదాశివం వసారాలో నులకమంచం మీద నల్లులతో పోట్లాడుతున్న సమయంలో, పార్వతమ్మ పడకగదిలో పరుపుమీద గుర్రుపెట్టి గాఢంగా నిద్ర పోతోంది.

ఆ గుడి ప్రాంగణంలో భక్తురాలితో పాటు యింకా పలుగులు పారలు పట్టు కుని తవ్వుతుంటే, పశుపతినాథ్ ఉలిక్కి పడిపోతున్నాడు. భక్తురాలు తన్మయ త్వంతో భక్తిగీతాలు పాడుతూ వుంటే, సదాశివం నులకమంచంమీద కూర్చుని శంకరున్ని తలుచుకుంటున్నాడు.

'తండ్రీ! సొమ్మును కాపాడటానికి నేను యివ్వాళ అక్కడలేను. ఈ రాత్రికి నువ్వే కాపలా వుండాలి. ఆ బాధ్యతంతా నీదే. దాన్ని రక్షించి, నాకు అప్ప గించాలి. ఏం చేస్తావో, ఎట్లా చేస్తావో' లోపల లోపల గొణుక్కుంటున్నాడు సదాశివం. వసారాలో వసికర్ర ఆధా రంగా నిలబెట్టిన వత్తిదీపం చప్పున కొడిగట్టింది. సదాశివం ఉలిక్కిపడ్డాడు. గుండె ఆగినంత పనయింది. గభాలున మంచంమీద నుంచి లేచాడు.

ఇట్టే భళ్ళున తెల్లారింది. ఆ గుళ్ళోకి వెలుతురు వచ్చింది. పార్వతమ్మ పడు కున్న గదిలో సూర్యకిరణాలు సోకినాయి.

సదాశివం ప్రాతఃసంధ్య సూర్యుని ఎదుట నిలబడి చేశాడు. ఒక్క క్షణం అక్కడ యింకా ఆగబుద్ధి పుట్టలేదు.

వెళ్ళొస్తానంటూ బయలుదేరేటప్పటికి పరమేశ్వరం పక్కన నవ్వాడు.

సదాశివం బిత్తరపోతూ చూస్తూ ఆగిపోయాడు, ఆ నవ్వుకు కారణం యేమిటా అని.

ఇంట్లో అడుగు పెడుతూ పెడుతూనే .... 'ఆ అమ్మాయి రాత్రంతా జాగరణ చేసిందా' అన్నాడు సదాశివం బెంగ్గా.

'నాకేం తెలుస్తుంది, నేను అటువైపు వెళ్ళానా పెట్టానా' అన్నది విసుగ్గా పార్వతమ్మ.

గబగబ స్నానంచేసి గుడివైపు పరుగెత్తాడు. చప్పున లోపలికి వెళ్ళాడు. మళ్ళీ బైటకు వస్తున్నాడు, కాని అతని అతని దృష్టి అంతా, గన్నేరుచెట్టు ఎడంవైపు దిమ్మమీదే వున్నది కాళ్ళూ చేతులు ఆడటం లేదు. అటూ ఇటూ తిరుగుతున్నాడు. భగవంతున్ని మనసారా ప్రార్థిస్తున్నాడు. జనం కొంచెం పల్చబడిన తర్వాత, గబగబ గన్నేరుచెట్టు వైపు నడిచాడు. పూలు కోస్తున్నట్లు నటిస్తూ మెల్లిగా కూర్చుని ఆ దిమ్మె వైపు చెయ్యి చాపాడు. అక్కడ భూమి బోలుబోలుగా కనిపించింది. దిమ్మెమీద మట్టి కప్పినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఆదుర్దాగా మట్టిని రెండు చేతుల్తో తీశాడు. పెట్టె తాకింది. అమ్మయ్య అనుకుని పెద్దగా నిట్టూర్చాడు. ఆ పెట్టెను రెండు చేతుల్తో బరువుగా పైకి తీశాడు. మనస్సు కుదుటబడింది. తాళంవైపు రెండు కళ్ళూ నిలిచాయి. ఇంకా ధైర్యం వచ్చేసింది. ధోవతి కొంగుకు కట్టిన తాళంచెవిని తీసి పెట్టె తెరిచాడు. కళ్ళు పెద్దవి చేశాడు. గుండె గుభేలుమంది. ఆ పెట్టెలో పెద్ద సైజు శివలింగాలు నాలుగు కనబడ్డాయి.

మూర్ఛవచ్చినంత పనయింది. అమ్మోనాయనో అనుకుని గుండెమీద చెయ్యి పెట్టుకున్నాడు.

బంగారపు నగలు లేవు. అతి భద్రంగా దాచిన వంద రూపాయల కట్టలు లేవు. వెండి మొలతాడు లేదు. నానుతాడు కనిపించటంలేదు. వాళ్ళ నాయనమ్మ పెద్ద కంటె జాడ లేనేలేదు. అతి భద్రంగా దాచిపుంచిన ఆయన మేనత్త వడ్డాణం అంతకంటే లేదు. పూర్వీకులు తనకు అప్పగించిన ఆస్తంతా అదృశ్యమయిపోయింది.

కళ్లు మిరమిట్లు కొలిపేటట్లు నాలుగు సాలిగ్రాములున్నాయి. వాటిని చూస్తుంటే నోరు మూతపడి పోయింది. గుటకలు వేస్తున్నాడు. మింగుడు పడటం లేదు.

ఎవరో వస్తున్నట్టు అలికిడి అయింది. చప్పున ఆ పెట్టెను కాస్త భూమిలోకి నొక్కిపెట్టి మట్టిని గాభరాగా వేసి, గుడి వైపు వచ్చేశాడు.

ఎవరెవరో వచ్చి యేమేమిటో మాట్లాడుతున్నారు సదాశివానికి చెవులు దిబ్బళ్ళేసినాయి. కళ్లు మసకేసినాయి. నోరు మూగబోయింది. వినిపించటం లేదు.

'నిన్ను నమ్ముకున్నందుకు యింత మోసం చేశావా? నువ్వే కాయచేశావు, ఎక్కడ దాచావో చెప్పు....' పిచ్చిగా తనలో తాను మాట్లాడుకుంటున్నాడు.

ఈశ్వరున్ని నమ్ముకున్నందుకు చెట్టంత కొడుకును మింగేశాడు. పెట్టెడు బంగారాన్ని మాయం చేశాడు. ఇంకా యెందుకోసం యీ పూజలు, పునస్కారాలు, యీ ఉపవాసాలు, యీ భజనలు ఈ నిష్ఠానియమాలు యెందుకు? యెందుకు? తనలో తాను తర్కించుకుంటున్నాడు.

ప్రతిధ్వని వినిపించినట్లయింది.

'ప్రతిఫలాపేక్షతో చేసిన పూజలు జపాలు తపాలు వృధా. కేవలం నన్నే నమ్ముకుని, నాకే అన్నీ వదిలేసినపుడే నేను వాళ్ళ యోగక్షేమాలు చూస్తాను. కాని అలాంటి విశ్వాసం, భక్తి, నిశ్చలత లేనప్పుడు నా బాధ్యతేమీ వుండదు....' గీతాబోధ తనకు వెన్ను తట్టినట్టయింది.

'నిజమే....నా అజ్ఞానాన్ని మన్నించు. మీ అబ్బాయి యెన్నిసార్లు అడిగినా ఒక్క పైసాకూడా యివ్వలేదు. ఇప్పుడంతా చెయ్యి జారిపోయింది. ఏమనుకున్నా ఏం ప్రయోజనం లేదు. తండ్రీ నిన్ను వేడుకుని అడుగుతున్నాను. ఈ రహస్యం నీకు, నాకు, మా అబ్బాయికి తప్ప నాలుగోవాడికి తెలియదు గదా? యీ సొమ్ము యెట్లా పోయింద ఈ రహస్యాన్ని యింకొకరికి యెందుకు చెప్పావు....' కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు, సదాశివం.

ఓనాడు పార్వతమ్మ యింట్లోకి వస్తూనే 'విన్నారా యీ మాట' అని యెంతో ఉద్వేగంగానూ ఆవేశంగానూ అన్నది.

సదాశివం తాపీగా కూర్చున్నాడు. చలనంలేదు. ఏమిటి ఆ మాట అని కూడా అడగలేదు.

పార్వతమ్మ సంతోషం పట్టలేక 'మనబ్బాయి .... బతికేవున్నా....ట్ట....' అన్నది బిగ్గరగా.

నోరువిప్పి నివ్వెరబోయి చప్పున నిలబడ్డాడు. ఎవరో వెన్ను తట్టినట్టనిపించింది.

'అవునండీ....ఆత్మహత్య చేసుకుంది ఎవరో అబ్బాయట. మనవాడే కావాలని పాపం పోయిన ఆ అబ్బాయి చొక్కా జేబులో తనపేరు రాసిపెట్టాట....'

'ఇది కలా? నిజమా....ఏమిటి నువ్వంటోంది....'

'అవును....అదిగో శంకరంగారొస్తున్నారు....ఆయన్ను అడగండి....'

'మొదట్లో నేనూ నమ్మలేదు.... మీ అబ్బాయి ఓ పెద్ద ఫ్యాక్టరీ పెట్టాట్ట. దాంట్లో వందమంది పనిచేస్తార్టకూడా. ఏవో పనిముట్లు తయారు చేస్తార్ట....మీ అబ్బాయి ఆ ఫ్యాక్టరీకి డైరెక్టరుట....' శంకరంగారు తనకు తెలిసిందేమిటో ఒక్కసారిగా చెప్పేసెయ్యాలని తాపత్రయ పడుతున్నాడు.

'ఏమిటి తండ్రీ యిది నిజమా....నేను వింటునది నిజమా....' సదాశివం తల్లడిల్లి పోతున్నాడు.

'అడుగో మీ అబ్బాయే వస్తున్నాడు....' శంకరం దభాలున అన్నాడు.

పార్వతమ్మ చప్పున ముందుకు వెళ్ళి 'నాయనా .... నువ్వేనా .... నాయనా....' పెద్ద పెట్టున ఏడ్చింది.

'అవునమ్మా....నేనే....నాన్నా? ...'

పార్వతమ్మ ఉక్కిరిబిక్కిరయ్యేట్టు ఎన్నో ప్రశ్నలు వేస్తోంది.

'అంతా చిత్రంగా వుంది....ఎంత సాహసం చేశావు....'

'మీతో చెప్పకుండా యింత చేసినందుకు క్షమించండి....'

ఆ విధంగా చేస్తేనేగాని, యీనాడు మనం పదిమందిలో తలెత్తుకుని తిరగగలిగేవాళ్ళం కాదు.

'ఎవరు....యీ పిల్లను యెక్కడో చూసినట్టుంది ...' పార్వతమ్మ గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తోంది.

'మీ కోడలు...' అన్నాడు గంగాధరం నవ్వుతూ.

'ఆ... నువ్వా....రాత్రి జాగరణ చేస్తానని వచ్చిన పిల్లవు కాదు....' సదాశివం నోట్లోనే గొణుక్కున్నాడు.

'మామగారూ క్షమించండి....'

'....ఎక్కడకు వెళ్ళినా అవమానాలూ ఎదురుదెబ్బలే. ఉద్యోగం దొరకటం లేదు....నాన్నను డబ్బు అడిగితే యివ్వలేదు. మంచి కార్యానికి ఉపయోగపడే డబ్బు కేవలం యెక్కడో చీకట్లో మురిగిపోవటం నా కిష్టంలేదు. అందుకనే మేమిద్దరం యీ ప్లాను వేశాం. మనం మన కాళ్ళమీద నిలబడకలుగుతే దేవుడైనా, మానవుడైనా సహాయం చేస్తాడు. ఆ శక్తి మనలోనే వుంది. అదే దైవశక్తి. మనలోవున్న దేవున్ని మనం కనుక్కోలేక, యెక్కడెక్కడికో పరుగెత్తుతూ వుంటాం...' గంగాధరం ఆత్మవిశ్వాసం ఎంతో పెరిగింది.

'నాయనా....'అంటూ కొడుకును దగ్గరకు తీసుకుని తల నిమురుతోంది పార్వతమ్మ.

గంగాధరం, ప్రక్కన నిలబడ్డ ఉషారాణి యిద్దరూ వారి ప్రమిదలో రెండు జ్యోతుల్లాగే, సదాశివానికి సాక్షాత్కరించారు.



# శ్రీ కృష్ణ లీలలు

రచన :
ముళ్ళపూడి వెంకటరమణ

బొమ్మలు :
బాపు

బాపు కుంచె — రమణ కలం, యీ రెండింటి అవినాభావ సంబంధం తెలుగు పాఠకలోకానికి ఒక అద్భుతమైన వరం।

ఈ మంచివాళ్ళిద్దరూ ఎప్పుడూ ఏదో ఒక మంచిపని చేయటానికి తాపత్రయ పడ్తూనే వుంటారు. ఆ మంచిపనుల్లో, ఎమెస్కోవారు యీ మధ్యనే విడుదలచేసిన "శ్రీకృష్ణలీలలు" వ్రాయటం ఒకటి.

సంగీతం నేర్చిన ప్రతి వ్యక్తి త్యాగరాయకృతులు పాడ్తాడు. కానీ వాటిని ఒక బాలమురళీకృష్ణో, సుబ్బలక్ష్మో పాడగా విని మనం పొందే ఆనందం వేరు. ఆ విధంగానే కృష్ణుడి గురించి మనందరికీ తెలిసినా, రమణగారి వ్యాఖ్యానంతో, బాపుగారి బొమ్మలతో మనం 'శ్రీకృష్ణలీలలు' చదివి, చూడటం ఒక మధురమైన అనుభవమే।

ఈ పుస్తకం అతి సరళమైన భాషలో, కృష్ణుడి జన్మగురించి, అతని చిలిపి లీలలు గురించి, కంసుడు కృష్ణుడివల్ల తనకి ప్రాణగండం వుందని తెలిసి, అతన్ని ఎలా వధించాలి అని పడే పాట్లను గురించి హృద్యంగా, రసమయంగా చెప్పిన అద్భుత చిత్రణ।

*చిన్నారి కృష్ణుడి చిలిపిలీలలు మనకి ఎంత నవ్వు తెప్పిస్తాయో!*

వ్రేపల్లెలో—

ఒక ఇంట్లో లక్ష్మీనారాయణుల పటాలు. ఒక గోపిక పాలు, వెన్నల నైవేద్యం పెడుతూంది. కళ్లు మూసుకు దండం పెట్టింది. విలాసంగా అక్కడ నించుని వెన్న గిన్నెలో వేలుపెట్టి తీసుకు తిన్నాడు.

'అయ్। తప్పుకదూ—దేవుడి కివి నైవేద్యం .... ఎంగిలి చేస్తావా....?'

'నేనే దేవుణ్ణి।' అంటూ మళ్ళీ వెన్న తీబోయాడు.

'హన్నా' అంటూ గోపిక లేచి పట్టుకోబోయింది. క్రిష్ణయ్య పరుగెత్తాడు. ఒ మూల దొరికిపోయాడు. ఆమె వంగి అతన్ని పిర్రమీద ఒకటి కొట్టింది.

పరిచయం : యద్దనపూడి సులోచనారాణి